# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## యస్వీయూను అగ్రస్థానంలో ఉంచడమే లక్ష్యం

**- నూతన ఉపకులపతి ఆచార్య నరసింగరావు**



తిరుపతి విద్య, అక్టోబర్ 10 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య తాతా నరసింగరావు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ గా పనిచేసి,ప్రస్తుతం హైదరాబాద్ ఐఐటీలో అనుబంధ ఆచార్యులుగా పనిచేస్తున్న వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం యస్వీయూ నూతన ఉపకులపతిగా మూడు సంవత్సరాల కాలపరిమితో నియమించింది.ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా తనకు అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. ఎక్కడో బొబ్బిలి దగ్గర మారుమూల ప్రాంతం నుంచి అతి పేదరికం నుంచి,ప్రభుత్వ విద్యా సంస్థల్లో తెలుగు మీడియం చదువుకుని వచ్చిన తను విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవిని పొందడం నిరంతరం కష్టపడడం వల్ల సాధ్యమైందని అన్నారు. తెలుగు మీడియం చదివి బెనారస్ హిందూ యూనివర్సిటీ ఎం.యస్సీ.కెమిస్ట్రీ, పిహెచ్.డి పూర్తి చేశానని జపాన్లో ఏడు సంవత్సరాల జపాన్ లో నానో టెక్నాలజీలో ప్రాజెక్టులో చేశానని, తర్వాత ఇంటర్ నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ లో పనిచేస్తూ పేటెంట్లు సాధించానని అన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం మంచి ప్రణాళికలు తను సిద్ధం చేసుకుని వున్నానని, యస్వీయూలో ఉన్న ఆచార్య సిబ్బందితో నిరంతరం కష్టపడి అద్భుతాలు సృష్టించాలను కుంటున్నట్లు వారు తెలిపారు. అధ్యాపక అధ్యాపకేతర, పరిశోధక విద్యార్థుల సాయంతో విశ్వవిద్యాలయాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టే లక్ష్యం దిశగా సాగుతామని అన్నారు. ఈ సందర్భంగా విసిని వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, డీన్లు, శాఖాధిపతులు, ఇంజనీర్, బోధన,బోధనేతర సిబ్బంది వారిని కలిసి అభినందించారు.

**ఎస్వీయూ విసికి ఘన సన్మానం :**

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య తాత నర్సింగరావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్లోబల్ లా కళాశాల చైర్మన్ డాక్టర్ రామసాని తిప్పారెడ్డి ఘనంగా సన్మానించారు.లా కళాశాల సిబ్బందితో కలిసి ఉపకులపతికి పుష్పగుచ్ఛం అందించి దుశ్యాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బిజయ్ కుమార్ బెహర,సెక్రెటరీ లక్ష్మి వశస్త పాల్గొన్నారు.

## స్వర్ణరథంపై విహరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, అక్టోబర్ 10 ప్రభాతవార్త: కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన వరసిద్దుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయ హస్తం అందించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఉదయం 10గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు, చిట్టిబాబు, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగం కోసం కష్టపడిన తరహాలోనే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా...

## తీర్చిదిద్దాలి

**మెగా డిస్సీ ఉపాద్యయులకు కలెక్టర్ ఉద్భోద**




ఎంపికైన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కష్టపడి చదివి డిఎస్సీ రాసి ఉద్యోగం సంపాదించుకున్న ఉపాధ్యాయులు అదే తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మెగా డిఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం చిత్తూరు ఆర్‌కె ఇంటర్నేషనల్ స్కూల్‌లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్ నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎక్కడ అవినీతికి తావు లేకుండా ఉపాధ్యాయ ఉద్యోగంలో కొనసాగాలన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడు వున్న ఉత్సాహం కొన్ని రోజుల తరువాత తగ్గిపోకుండా సర్వీసు వున్నంత వరకు ఉత్సాహంను కొనసాగించి విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణ, వెన్యూ ఇన్‌ఛార్జీ ఇందిర, కోర్సు డైరెక్టర్ నాగేశ్వరరావు, ఎడి సుకుమార్, ఓవరాల్ ఇన్‌ఛార్జీ సుభాషిణి, ఎఎస్ఓ చాంద్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

**ధరల తగ్గింపుపై పూర్తి అవగాహన వుండాలి : కలెక్టర్**

జిఎస్టీ 2.0 ద్వారా ధరల తగ్గింపుపై వినియోగదారులు పూర్తి అవగాహన కలిగి వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జ్యోతిరావ్‌పూలే బిసీ భవన్‌లో శుక్రవారం కమర్షియల్ టాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ మేయర్ అముదతో కలిసి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులు, కిచెన్, మైక్రో ఇరిగేషన్, చేనేత, ఎల్ఐసి లాంటి ఇతర అంశాలకు సంబంధించి 44 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిఎస్టీ జాయింట్ కమీషనర్ ఎ.రవీంద్రనాథరెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ జిఎస్టీ పి.మహేష్‌కుమార్, డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ బి.శ్రీనివాసులురెడ్డి, టీమ్ సభ్యులు ఎ.రాజగోపాల్‌రెడ్డి, నాగరాజులు, సునీల్‌కుమార్, డికె హరిప్రసాద్, ఎన్.రణవీర్, కె.భార్గవ్, పి.శోభన, ఇతర



జిఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

## పంచాయితీలు జరిపినా... ఎడతెగని భూ వివాదం

**-రెవెన్యూ నిర్లక్ష్యం: పాలకులకు సంకటం**



అటవీశాఖచే చెట్లు నాటుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండల సింహాచల కండ్రిగలో దళితులు,అటవీశాఖ అధికారుల మధ్య వివాదాలకు సంబంధించి జిల్లా కలెక్టర్,జిల్లా అటవీ అధికారుల మధ్య శాసనసభ్యుని సమన్వయంతో సమావేశం జరిపి, రాజీ కుదర్చినా రెవెన్యూ అధికారులు ఇచ్చిన మాటను నిలబెట్టుకో నందువల్ల వారు కోర్టుకు వెళ్ళారు. స్టేటస్‌కో సాధించి, అటవీశాఖ నిర్వహిస్తున్న ప్లాంటేషన్ ఆగింది. నాడు కలెక్టర్ ప్రత్యామ్నయ భూములను సమీపంలో అందిస్తామని చెప్పి తీరా 15కిలో మీటర్ల దూరంలోని ఆంజనేయ పురంలో ఇస్తామనటంతో వివాదం మళ్ళీ మొదటికి వచ్చింది. 30 హెక్టార్లలో చెట్టు నాటగా ఇంకా 20హెక్టార్లలో నాటాల్సి ఉంది. రెవెన్యూ నిర్లక్ష్యం పాలకులకు శాపంగా మారిందనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగ గ్రామస్థులు, అటవీశాఖ అధికారులు మధ్య సుమారు 55 సంవత్సరాలుగా జరుగుతున్న వివాదానికి ఎంతో కృషి ప్రయత్నం చేసి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్,జిల్లా అటవీశాఖాధికారి వివేక్‌లు తెర వేసారు. ఈ సమస్య మళ్ళీ జటిలంగా మారింది. పరిపాలనకు సవాలుగా మారిన సమస్యను ఎంతో సున్నితంగా శాసనసభ్యుడు పరిష్కరించారు. ఈ సమస్యను పరిష్కరిం చుటకు శాసనసభ్యుడు ప్రత్యేకంగా జిల్లా అధికారులతో ఆగస్టు 20న పరిష్కరించిన సమస్యలో ఇచ్చిన హామీలను అమలు చేయక పోవటంతో బాధితులు మళ్ళీ కోర్టుకెక్కారు. సింహాచల కండ్రిగ దళిత వాడలకు సంబంధించిన 93 మందికి పూర్వం పట్టాలిచ్చినట్లు ఉంది, అయితే ఈ పట్టాలను రద్దు చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉండటంతో ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుటకు సమావేశం ఏర్పాటు చేసారు. ఈ నేపథ్యంలో సింహాచలకండ్రిగ లోని పట్టాదారులను కూడా ఆహ్వానించారు. ఈ సమావేశంలో పట్టాలున్నట్లు చెబుతున్న వారి బాధలను కలెక్టర్ విన్నారు. అయితే ఎవరికి ఇబ్బంది లేకుండా 'సింహాచల కండ్రిగలో పట్టాలున్నట్లు చెబుతున్న వారికి 'ప్రత్యామ్నాయ భూము లివ్వటానికి' హరిత అభివృద్ధి కింద అటవీశాఖకు మంజూరు అయిన నిధులను సద్వినియోగం చేసుకొనుటకు నిర్ణయించారు.

ప్రభుత్వాధికారులు, స్థానిక నాయకుల మధ్య జరిగిన చర్చల్లో నాడు పట్టాలు పొందిన రైతులకు 'సాగుభూమి పట్టాలు ప్రత్యామ్నాంగా సమీపంలో ఇవ్వటానికి సమావేశంలో రెవెన్యూశాఖ తరఫున కలెక్టర్ భరోసా ఇచ్చారు. వారి పనులకు సింహాచల కండ్రిగ నుంచి ఎవ్వరూ అభ్యంతరం చెప్పరని పనులకు ఆటంకం కల్గించరని భరోసా ఇచ్చారు. అయితే నాటి ఒప్పందాన్ని అమలు చేయటంలో రెవెన్యూ నిర్లక్ష్యం పాలకులకు శాపంగా మారింది. బాధితుల్లో బండి సుబ్బ లక్ష్మమ్మ మరి ముగ్గురు కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తెచ్చుకున్నారు. దాంతో 30హెక్టార్లలో పూర్తి అయిన ప్లాంటేషన్‌కు బ్రేక్ పడింది.

## జాతీయ స్థాయిలో గోల్‌బాల్ ప్రతిభ చాటిన విద్యార్థులు



నరేంద్ర కుమార్ -సంధ్య

వెంకటగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త: గోల్ బాల్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. నరేంద్ర, సంధ్యలకి ఇండియన్ యూత్ గోల్‌బాల్ జాతీయ జట్టులో స్థానం బ్లైండ్ స్పోర్ట్స్‌లో ఆంధ్ర ప్రతిభకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఆంధ్రదేశ్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్వాలియర్‌లో జరిగిన ప్రథమ యూత్ నేషనల్ గోల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి, రాష్ట్ర కీర్తిని దేశవ్యాప్తంగా చాటారు. విశాఖపట్నంలోని నేత్ర విద్యాలయం నుండి పాల్గొన్న నరేంద్ర కుమార్, కె.సంధ్యలు, అద్భుత ప్రదర్శనతో ఇండియన్ యూత్ గోల్‌బాల్ జాతీయ జట్టు సెలెక్షన్ ట్రయల్స్‌కి ఎంపికయ్యారు. ఇది రాష్ట్రానికి మాత్రమే కాదు. దేశంలోని దివ్యాంగ క్రీడాకారుల్లో ఉన్న అసాధారణ ప్రతిభకు ప్రతిరూపం, అని రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య తెలిపారు. సంఘ స్థాపకులు ముప్పాళ్ల శేషగిరి, రాష్ట్ర కోశాధికారి ఈత మొక్కల మురళి, ఉపాధ్యక్షులు చింటూ గణపతి, ఖలీల్, నగేష్, వాసుదేవరావు ఈ జాతీయ స్థాయి విజయంతో మరిన్ని దివ్యాంగ యువత క్రీడలవైపు అడుగులు వేస్తారు. వీరి విజయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణం అన్నారు. ఇలాంటి విజయాల ద్వారా బ్లైండ్ స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రభుత్వం, సమాజం నుండి మరింత సహకారం అవసరం అని వారు అభిప్రాయపడ్డారు.

## వర్షం వస్తే అంతే..!

**- చెరువును తలపిస్తున్న రోడ్లు.. చోద్యం చూస్తున్న అధికారులు**



వర్షపునీటితో చెరువును తలపిస్తున్న రోడ్లు

సూళ్లూరుపేట, అక్టోబర్ 10 ప్రభాతవార్త : పట్టణంలో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అస్తవ్యస్థమైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లపై ఆక్రమణల జోరు కావడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగు తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయం చుట్టూ, ఆర్‌అండ్‌బి రోడ్డు, గమండ్ల వీధి, రైల్వేఫీడర్స్ రోడ్డు, లోతట్టు ప్రాంతాల్లో వర్షం వస్తే ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజి ఉన్నప్పటికీ వాటిలోకి నీరుపోయే సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్‌అండ్‌బి రోడ్డుపై ఉన్న డ్రైనేజీల మీద ఆక్రమణలు ఎక్కువ కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకుని రొచ్చు రహదారుల నుంచి విముక్తి కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## పద్మావతి అమ్మవారి...

## బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

**-అందరి సమిష్టి సహకారం అభినందనీయం -సాలకట్ల బ్రహ్మోత్సవాలు దిగ్విజయంపై అధికారులు**



తిరుమల,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి: సాలకట్ల బ్రహ్మోత్సవాలను సమిష్టిగా దిగ్విజయం చేసిన రీతిలోనే, అదే స్పూర్తితో తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాలను, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాలని టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ కోరారు. బ్రహ్మోత్సవాలకు కల్పించిన సౌకర్యాలపై ఈ సారి ఎటుచూసినా సానుకూల వాతావరణం కనిపించిందని అన్నారు. టిటిడి కల్పించిన సౌకర్యాలపై భక్తులు, గ్యాలరీల్లోని, క్యూలైన్లలో భక్తులు వందశాతం సంతృప్తి వ్యక్తం చేయడం ప్రతి ఒక్కరి పనితీరుకు నిదర్శనమన్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు విజయవంతం వెనుక ఉన్న సహకారం, సమన్వయంతో కృషిపై పోలీస్, టిటిడి విజిలెన్స్, జిల్లా యంత్రాంగం, మీడియాప్రతినిధులతో తిరుపతి మహతి ఆడిటోరియంలో శుక్రవారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,జెఈఓ వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు. ఈఓ సింఘాల్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో గ్యాలరీల్లోనూ, క్యూలైన్ల లోనూ గరుడసేవరోజు ప్రణాళికా బద్దంగా ప్రతి ఒక్కరూ సేవలందించడంతోనే ప్రతి ఒక్కభక్తునికి అన్ని రకాల అన్నప్రసాదాలు,తాగునీరు. మజ్జిగ,కాఫీ,పాలు అందాయన్నారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేందుకు పారిశుధ్యపనులు చేశారని, ఆకట్టుకునేలా విద్యుద్దీప కాంతులు, పుష్పాలంకరణలు, రవాణా, ట్రాఫిక్ తదితర సేవలు సమన్వయంగా పర్యవేక్షించారన్నారు. టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలపై ప్రతి అంశాన్ని నమోదు చేసుకుని రాబోవు రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేలా చూస్తామన్నారు. జెఈఓ వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతిరోజూ అధికారులతో సమీక్షించుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందరూ టీమ్‌గా పనిచేసి విజయవంతం చేశామన్నారు. ఈ ఏడాది సాంకేతిక సేవలను సద్వినియోగం చేసుకున్నామన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. టిటిడి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో కార్యక్రమంలా భావించి జాగరూకతతో పనిచేయడమే దిగ్విజయానికి ప్రధాన కారణమన్నారు. ఈ సమావేశంలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, ఏఎస్పీలు రవిమనోహరచారి, వెంకట్రావ్, నాగసుబ్బన్న, డిఎస్పీలు విజయశేఖర్, వెంకటనారాయణ, భక్తవత్సలం, ప్రసాదరావు, రామకృష్ణమాచారి, శ్యామ్‌సుందర్, విజిలెన్స్ విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుపతిజిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## పొంగి పోర్లుతున్న వాగులు

**పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం**

తవణంపల్లె, అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండలంలో గురువారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గత 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని నదులు, వాగులు వంకలు ఒక మోస్తరుగా ప్రవహిస్తున్నాయి. అయితే గతవారం రోఉల క్రితం మండలంలో భారీ వర్షాలు కురవడంతో ఈవాగులు, వంకలు, నదులు ఉధృతంగా పొంగి ప్రవహించాయి మండలంలోని పడమటి సరిహద్దు మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వరదనీరు భారీగా మండలానికి వచ్చి చేరుతోంది. దీనితో మండలంలోని అరగొండ సమీపంలో బహుదానది, గొడ్డువంక, మత్యం వంకలు ఉధృతంగా ప్రవహించాయి. అయితే వరద తడ్డుముఖం పడుతున్న నేపథ్యంలో గురువారం రాత్రి మరో మారు పడమటి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో మండలంలోని పలు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి అలాగే మండలంలోని పలువురు రైతులకు చెందిన పంట పొలాలు కోతకు గురైంది. భారీ వర్షాల కారణంగా బహుదానది, జొన్నగురకల వద్ద మత్యం వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండంతో పలు గ్రామాలకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఉత్తర బ్రాహ్మణపల్లె- కాణిపాకం రోడ్డులోని పుణ్యసముద్రం వద్ద బహుదానది పైన, మత్యం-బంగారుపాళ్యం రోడ్డులోని దిగువమత్యం సమీపంలోని మత్యం వంక బ్రిడ్జిపై వరదనీరు ఉపొ ్పంగి ప్రవహిస్తోంది, దీనితో ఆమార్గాల్లో ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. మండలంలో అక్టోబర్ నెలలోనే భారీ వర్షాలు నమోదవుతుండడంతో మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని చెరువులు పూర్తి స్థాయిలో నిండిపోవడంతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వర్షాలు పుష్కలంగా కురవడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇదిలా వుండగా శుక్రవారం రాత్రి మండల కేంద్రం తవణంపల్లెలో 54 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు మండల రెవెన్యూ అధికారులు తెలిపారు.



మత్యం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

## వారధిపై వేగంతో విద్యార్థులు దుర్మరణం



తిరుపతి,అక్టోబర్ 10ప్రభాతవార్త: ట్రాఫిక్ సమస్యలేకుండా సాఫీగా సాగిపోయే గరుడవారధి వాహనాల ప్రమాదాలకు నిలయమవుతోంది. గత వారంరోజుల్లోనే మూడు ప్రమాదాలు జరగడం విచారకరం. గరుధవారధిపై వాహనాలు నడిపే సమయంలో అవగాహన లేకపోవడం, అతివేగం చివరకు ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. ఇందుకు నిదర్శనంగా శుక్రవారం ఉదయం ఇద్దరు బిటెక్ చదువుతున్న విద్యార్థులు బుల్లెట్‌పై తిరుచానూరు -తిరుపతి మార్గంలోని గరుడవారదిపై ప్రయాణిస్తూ లక్ష్మీపురం కూడలి సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వారధిపై నుండి క్రిందపడటంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆ ఇద్దరు యువకులు చంద్రగిరి సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు యువకులు చంద్రగిరి మండలం కందులవారిపల్లికి చెందిన కనిష్క్ (22), కొట్టాలకు చెందిన వాస్తవ్ కామినేని (19)గా పోలీసులు గుర్తించారు. కనిష్క బుల్లెట్‌ను నడుపుతూ లక్ష్మీపురం కూడలి వద్ద అదుపుతప్పి క్రిందపడటంతో ఈ విషాదం జరిగింది. మృతుల వద్ద ఆధారాలు బట్టి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి గరుడవారధి తరచూ ప్రమాదాలకు కేంద్రంగా మారింది. శ్రీనివాసం నుండి కపిలతీర్థం మార్గంవరకు ఉన్న ఈ వారధిపై తరచూ వాహనాలు వేగంతో దూసుకెళ్ళి అదుపుతప్పి బోల్తాపడటం, ద్విచక్రవాహనదారులు క్షతగాత్రులవడం, కార్లు ఢీకొనడం వంటివి జరుగుతున్నాయి. అయినా గరుడవారధిపై ప్రమాదాల నియంత్రణకు పోలీసులు సిసి కెమెరాలు అమర్చడం, పోలీసులను నియమించడం చేయాల్సి ఉన్నా అటువైపు ఆలోచన కూడా లేకపోతోంది. దీంతో తరచూ ప్రమాదాలు జరిగిపోతున్నాయి.. ప్రముఖులు ఎవరైనా వచ్చిన సమయాల్లో వారధిపై రాకపోకలు నిలుపుదలచేస్తున్నారు. అంతేతప్ప జెట్‌వేగంతో దూసుకెళుతున్న వాహన దారులను పట్టుకుని అవగాహన కల్పించడంలో విఫలమ య్యారు. శ్కుకవారం ప్రమాదంతో మృతదేహాలను ఈస్టు పోలీసులు ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. ఈస్టు సిఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.సరదాగా గరుడవారధిపై రేసింగ్‌లు, అమితవేగంతో వెళ్ళడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరీ మన పోలీసులు ఇకనైనా చర్యలు తీసుకోవాల్సి ఉందని నగరవాసులు కోరుతున్నారు.

## భర్తను హత్య చేసిన కేసులో...

## భార్య, ప్రియుడు అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ సాయినాథ్

చిత్తూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన కేసులో శుక్రవారం పోలీసులు భార్య, ప్రియుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబం ధించిన వివరాలను చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, ఎస్ఐ రమేష్‌బాబులతో కలిసి వెల్లడించారు. చిత్తూరు సంతపేట దుర్గమ్మగుడి వీధిలో నివాసం వుంటున్న బి.వెంకటేష్‌ని అతని రెండవ భార్య సంతపేట దుర్గమ్మ గుడివీధికి చెందిన తులసీ మునియమ్మ అలియాస్ కావ్య(22), సంతపేట చవటపల్లి రోడ్డు, దుర్గాకాలనీకి చెందిన ప్రియుడు ఆర్.సురేష్ (23) హత్య చేశారు. ఈ నెల 6వ తేదీ కుమారుడు బి.వెంకటేష్ హత్యకు గురికావడంతో అతని తల్లి చిత్తూరు టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు స్వీకరించి రంగంలోకి దిగిన ఇన్స్‌పెక్టర్ నెట్టికఠయ్య విచారణ చేపట్టారు. పోస్టుమార్టం రిపోర్టులో వెంకటేష్ హత్యకు గురయ్యాడని తేలడంతో ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఈ కేసులో కీలక ఆధారాలను పోలీసులు సేకరించారు. మృతుడు వెంకటేష్ తన రెండవ భార్య తులసీమునియమ్మ అలియాస్ కావ్య ప్రవర్తనపై అనుమానం కలుగడంతో ఆమెకు ఆర్.సురేష్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం వుందని తెలుసుకున్న వెంకటేష్ ఆమెను వారించే క్రమంలో ఇద్దరికి తరచు గొడవలు జరిగేవి. ఈ పరిస్థితుల్లో వెంకటేష్ భార్య కావ్య ప్రియుడి సురేష్‌తో కలిసి భర్తను హత్య చేయాలని పథకం రచించి అమలు చేసింది. ఈ క్రమంలో 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంట్లో వెంకటేష్ నిద్రిస్తుండగా భార్య కావ్య, ప్రియుడు సురేష్ ఇద్దరు కలిసి వచ్చి తాడుతో వెంకటేష్ గొంతుకు బిగించి హత్య చేశారు. ఈ హత్యను దాచిపెట్టడానికి తాడును మంచం కింద దాచి దానిని ఆత్మహత్యగా మార్చారు. నిందితులపై నిఘా వుంచిన పోలీసులు శుక్రవారం సాయంత్రం 5.40 గంటలకు కావ్య, సురేష్‌లను అరస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ కిట్‌ల పంపిణీ



**తవణంపల్లె, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మండల కేంద్రం తవణంపలె భవిత కేంద్రంలో విద్యార్థులకు అలింకి వారి సహకారంతో సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో టీచింగ్ లెర్నింగ్ కిట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధి కారులు హేమలత, మోహన్‌రెడ్డిలతో కలసి మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ భవిత కేంద్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి, సమగ్రశిక్ష ఏఈ మునిరత్నం, సహిత విద్యా ఉపాధ్యాయులు దేవేంద్ర, దిలీప్, సీఆర్‌సీ చిట్టిబాబు, భవిత విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

**చిత్తూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** చిత్తూరు టుటౌన్ పరిధిలో ఇళ్ళల్లో దొంగతనాలకు పాల్పడే అంతర్‌రాష్ట్ర నిందితుడిని శుక్రవారం టుటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కర్నాటక రాష్ట్రం బళ్ళారి జిల్లా కరిమానమ్మ కాలనీకి చెందిన హనుమంతప్ప(27) నుండి టుటౌన్ పోలీసులు రూ.25 లక్షలు విలువైన 210 గ్రాముల బంగారు నగలు, రూ.2 లక్షల నగదు, రూ.1 లక్ష విలువైన ద్విచక్రవాహనంను స్వాధీనం చేసుకన్నారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో డిఎస్పీ సాయినాథ్ వివరాలు వెల్లడిస్తూ గత నెల 30వ తేదీ రాత్రి చిత్తూరు రామ్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఇంటి యాజమాని అల్తాఫ్ అక్టోబర్ 10వ తేదీ ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేశారన్నారు. ఈ మేరకు ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో చిత్తూరు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంతయ్య, ఎస్‌ఐ రమేష్‌బాబు సిబ్బందితో కలిసి కొన్ని బృందాలుగా ఏర్పడి కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, ఇతర కొన్ని ప్రదేశాలను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. టుటౌన్ పోలీసులకు రాబడి సమాచారం మేరకు శుక్రవారం నిందితుడు హనుమంతప్ప బ్యాన్స్ హోటల్ వద్ద వున్నట్లు తెలియడంతో ఇన్స్‌పెక్టర్ నెట్టికంతయ్య, ఎస్‌ఐ రమేష్‌బాబు సిబ్బందితో వెళ్ళి హనుమంతప్పను అరెస్టు చేయడం జరిగిందన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో దసరా వేడుకలు

**పలమనేరు టౌన్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్యాలయంలోనూ వాటర్ బోర్డు లోనూ శుక్రవారం దసరా వేడుకలు ఘనంగా నిర్వ హించారు. మున్సిపల్ కమీషనర్ కెవి రమణారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు దుర్గమ్మ తల్లి, లక్ష్మీ, వెంకటేశ్వరుడు, సరస్వతి, వినాయకుని విగ్రహా లకు పూజలు చేసి శుభం కలగాలని ఆకాంక్షిం చారు.కౌన్సిలర్లు,మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.



## మంగళం పేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పర్నిచర్స్ వితరణ



**కల్లూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త** మండలంలోని మంగళం పేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు 15 వేల రూపాయిలు విలువ చేసే అవసరమైన బీరువా, కార్యా లయంకు బల్లను పూర్వ విద్యార్థులు మండల విద్యా శాఖాధికారులు పోకల తాతయ్య, ఉపాధ్యాయులు పిబి చక్రధర్ బాబు, మహమ్మద్ సుల్తాన్, ఎల్లంకి వారి పల్లి జడ్పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు హరిశంకర్‌లు విద్యాశాఖాధికారుల సమక్షంలో ప్రధానోపాధ్యా యులు మోహన్‌కు శుక్రవారం అందజేసారు. అలాగే బెహ్రాయిన్‌లో పనిచేస్తున్న కరణం శిధర్ 10 వేల రూపాయలు, గతంలో పని చేసిన వికోటకు బదిలీ అయిన ఉపాధ్యాయులు పి. చంద్ర 5 వేల రూపా యిలు పాఠశాల అభివృద్ధికి అందజేసారు. మండల విద్యాశాఖాధికారులు దాతలను అభినం దించారు. పాఠశాల అభివృద్ధి కొరకు గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని ఎంఈఓలు కోరారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం



**కల్లూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త** పౌష్టికాహారంతో ఆరోగ్యం, ఆనందంగా ఉండాలని సిడిపిఓ వాణి శ్రీ దేవి పేర్కొన్నారు. ఐసిడిఎస్ పులిచర్ల ప్రాజెక్టు పరిధిలోని చల్లావారిపల్లి అంగన్‌వాడి కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను సిడిపిఓ వాణి శ్రీ దేవి, సూపర్వైజర్ విజయలక్ష్మిలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలకు, పిల్లలకు అంగన్‌వాడిలో ఇచ్చే పౌష్టికాహారం బాలసంజీవని, కిట్ బాలామృతం, గుడ్లు, పాలు, బియ్యం, పప్పు, నూనె తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని, చిన్న పిల్లల పెరుగుదలకు, యుక్త వయస్సు అమ్మాయిలు ఆరోగ్యంగా ఉండేందుకు అందించాల్సిన పోషకాహారం లోకల్‌గా దొరికే ఉచితంగా ఆకు కూరాలు, కూరగాయలు, పండ్లు తీసుకుని లోపపోషణ గురికాకుండా ఆనందంగా ఉండాలని వివరించారు. పిల్లలలో ఊభకాయం లేకుండా చెక్కెర, నూనె, ఉప్పు, వాడకం తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం హరి, సెక్రటరీ మురళి, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ రాజేంద్ర, అంగన్‌వాడి వర్కర్స్ రేఖ, రాధిక, శ్యామల, అంగన్‌వాడి హెల్పర్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవకుడికి నిజమైన గుర్తింపు

## వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వల్లివేడు పృథ్వి రెడ్డి



**కల్లూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త** వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా (పార్లమెంట్) వల్లివేడు పృథ్వి రెడ్డి అలియాస్ రాజారెడ్డిని నియమించారు. ఈ మేరకు వైసిపి రాష్ట్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వల్లివేడు పృథ్వి రెడ్డి ఆది నుంచి వైసీపీ పార్టీలో కొనసాగుతూ మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉంటూ పార్టీ బలోపేతానికి ముందుంటున్నారు. అధికారంలో ఉన్న లేకున్నా పదవులు ఆశించకుండా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనలతో వైసిపి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వల్లివేడు పృథ్వి రెడ్డి నియోజకవర్గం స్థాయిలో కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు పొంది అనుచర వర్గాన్ని ఆదుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని, తనను నియమించిన మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వల్లివేడు పృథ్వి రెడ్డికి పదవి రావడంతో ఆయన అనుచరులు సంబరాలు చేసుకున్నారు.

## కాణిపాకంలో టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్

**కాణిపాకం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ (ఎల్‌ఏసీ) ఛైర్మన్ సుమంత్‌రెడ్డి శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ డీకేటీ పట్టాలను రద్దు చేయాలి : సీపీఎం

**సత్యవేడు, అక్టోబరు 10 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం వానెల్లూరు రెవెన్యూలో అక్రమంగా ఇచ్చిన డీకేటీ పట్టాలను రద్దు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో పని చేసిన రెవెన్యూ అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శించి పేదలకు చెందాల్సిన భూములనే కాకుండా అటవీ భూములను కూడా వదలకుండా అక్రమంగా దొంగ సర్వే నంబర్లు వేసి వందల ఎకరాలను అక్రమార్కులకు కట్టబెట్టారని విమర్శించారు. జిల్లా అధికారులు వా నెల్లూరు భూములపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోకపోతే భూ పోరాటానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

## ఉద్యమ నాయకునికి వెంటనే ఉద్యోగంలో తీసుకోవాలి



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** తపాలా జాతీయ ఉద్యమ నాయకుడు మహాదేవయ్యను తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ తపాలా శాఖ పోస్ట్‌మెన్,ఎంటిఎస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మురళి డిమాండ్ చేసారు.ఈ నేపథ్యంలో శుక్రవారం శ్రీకాళహస్తిలోని సబ్‌పోస్టాఫీసు కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత చర్యలలో భాగంగా ఆల్‌ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మహాదేవయ్యను ఉద్యోగం నుంచి తొలగించటం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టామన్నారు.ఈ కార్యక్రమాలకు కె.మురళి, ఎం.వెంకటేశ్వర్లు, జి.మురళీధరన్, పి.కిరణ్‌కుమార్, విజయకృష్ణ,అర్ముగంల పర్యవేక్షణలో ఉద్యోగులు పాలొన్నారు.

## అరవకొత్తూరు వద్ద ప్రమాదం...

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చనిపోగా ఇద్దరు గాయపడి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.ఉడమల పాడుకు చెందిన యువతి స్వాతి(26), మరో ఇద్దరితో తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నట్లు సమాచారం ఈ ప్రమాదంలో స్వాతి అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు.రూరల్ సిఐ డి.గోపి అందించిన సమాచారం మేరకు ఉడమల పాడుకు చెందిన గురవయ్య, ఆతని భార్య స్వాతి, ఆరునెలల పసికందుతో తమ మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా ఈ మార్గంలో వస్తున్న టిప్పర్ ఢీకొన్నట్లు ప్రాథమిక సమాచారం మేరకు తెలిసిందన్నారు.

## వార్డు సభ్యుడు మృతి..ఆర్థికసాయం

**రామకుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మండలంలోని వీర్నమల పంచాయతీ కుల్లగానూరుకు చెందిన వైకాపా నేత, వార్డు సభ్యుడు మురళి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నేతలు మురళి మృతదేహానికి నివాళులు అర్పించి ఆయన కుటుంబీకులకు ముప్పై వేల రూపాయల సాయం అ ందించారు. పార్టీ తరపున ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బాబురెడ్డి,సుబ్రమణ్యం, చంద్రారెడ్డి,యశ్వంత్‌రెడ్డి, మోహన్ నాయక్, రవి నాయక్, చిన్నరాజునాయక్ పాల్గొన్నారు.

## యాంటీ బయాటిక్స్‌పై అవగాహన సదస్సు



**గుడుపల్లె, అక్టోబర్10 ప్రభాతవార్త:** మండలంలోని మంజునాథ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నార్కోటిక్స్, యాంటీ బయాటిక్స్ వాడకంపై కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి.వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ నార్కోటిక్స్ మందులు అధికంగా వాడితే తీ వ్రమైన ముప్పు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, ఎడిసి హరి ప్రసాద్, ఎపి సిఅండ్‌డి సంఘ అధ్యక్షుడు పివి రత్నం, డిఐలు కీర్తన, ప్రశాంతి, రూతు, జిల్లా అధ్యక్షుడునరేష్‌బాబు, కుప్పం అధ్యక్షుడు మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో లేగదూడలు మృతి

**శాంతిపురం,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** మండల న్నాయి.గురువారం రాత్రి ప్రభాకర్‌నాయుడు, లేగదూడలపై వీధి కుక్కలు దాడి చేసి చంపే ఉండడంతోనే కుక్కలు విపరీతంగా పెరిగాయని శునకాలను అరికట్టాలని కోరారు.



## విద్యార్థులు శారీరక..మానసికోల్లాసం కలిగి ఉండాలి



**శాంతిపురం, అక్టోబర్ 10ప్రభాతవార్త :** విద్యార్థులు శారీరక, మానసికోల్లాసం కలిగి ఉండాలని జిఆసిడిఓ ఇం ద్రాణి పేర్కొన్నారు. శుక్రవారం కడపల్లి కెజిబివిలో జరిగిన మానసిక ఆరోగ్యం-కెరీర్‌పైఅవగా హన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మొబైల్ ఫోన్ల వాడకంతో కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలోఎంఇఒ చంద్రమ్మ, ప్రిన్సిపాల్ జమున, సలహా దారు లుచామంతి, మహేశ్వరి, మనీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## విజయంలో ప్రెషర్స్‌డే వేడుకలు

**చిత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, సుందరరాజపురం లోని విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు శుక్రవారం ప్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ మెంటార్, ట్రైనర్ ఎన్‌చంద్రమోహన్, గౌరవ అతిథిగా యంగ్ మైండ్స్, టేక్ ఆఫ్ ఎడ్యూ గ్రూప్ వ్యవస్థాపకులు, సిఈఓ వినయ్ అంగలకూడి మూర్తిలు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు అధ్యాపకుల మార్గదర్శకాన్ని సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. విజయం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాఎం. తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ డా. శైలజామూర్తిలు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ అనేది విజయానికి మూలం అని, జీవన లక్ష్యాలను చేరుకోవడంలో క్రమశిక్షణే కీలకమని ఉద్ఘాటించారు.ప్రిన్సిపాల్ డా.కె గోపి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నీవానది పరివాహక ప్రజలకు అల్పాహారం



**చిత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** వర్షాల నేపధ్యంలో వరద నీరు నగరంలోని వీరభద్రకాలనీ, ధోబి ఘాట్ తదితర ప్రాంతాల్లో పొంగి ఇళ్లలోకి నీరు చేరడంతో శాసనసభ్యులు గురజాల జగన్‌మోహన్ ఆదేశాలతో తెదేపా నాయకులు, అధికారులు అక్కడికి చేరుకొని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక ప్రజల ఇబ్బందులను గమనించి జిజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం వీరభద్ర కాలనీ, దోబిఘాట్ ప్రాంతాల్లో ప్రజలకు అల్పాహారం అందజేసారు. ఈ సహాయక చర్యల్లో కమీషనరు నరసింహప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, నగర అధ్యక్షుడు నరేష్, కార్యదర్శి పచ్చయ్యప్ప, శశి, ఐటిడిపి సాయి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిరాశ్రయుల దినోత్సవ వేడుకలు

**చిత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, న్యూ కయనికట్టు వీధిలో మెప్మా, నగరపాలకసంస్థ సహకారంతో సపోర్టుసంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగృహంలో సంస్థ నిర్వాహకులు జోసఫ్‌రాజు నిరాశ్రయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరాశ్రయులకు పండ్లు, బ్రెడ్స్, టవల్స్ అందజేసారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది ప్రమీళ, శ్రీనివాసన్, ఇంద్రాణి, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.




## లాటరీ టికెట్ల విక్రేత అరెస్టు

***పలమనేరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:*** పట్టణంలోని పాతపేటలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న అహ్మద్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు శుక్రవారం పలమనేరు సిఐ మురళీమోహన్ తెలిపారు. పాతపేట పోలీస్‌లైన్‌లో నివాసమున్న అహ్మద్ లాటరీ టికెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇతని నుండి లాటరీ టికెట్లు విక్రయించగా వచ్చిన రూ.5020/ తో పాటు రూ.22720లు విలువైన 199 లాటరీ టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇతనికి లాటరీ టికెట్లు అందజేసిన చౌడప్ప అనే వ్యక్తి పరారీలో వున్నాడని అతని మీద కూడా కేసు నమోదు చేశామన్నారు.

## గంజాయి నిందితుడు విజయ్ అరెస్టు : సీఐ



**సత్యవేడు, అక్టోబరు 10 ప్రభాతవార్త:** సత్యవేడు పోలీసులు నేరస్తులపై ఉక్కుపాదం మోపుతూన్నరు. ఈ నేపథ్యంలోనే గంజాయి కేసుకు సంబంధించి రెండో నిందితుడు విజయ్(30)ను పోలీసు అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ మురళీనాయుడు ఆధ్వర్యంలో నిందితుని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గత నెల 19వ తేదీ ఒకటిన్నర కిలో గంజాయిని, ద్విచక్రవాహనాన్ని మాధరపాకం మలుపు వద్ద స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన ఇది వరకే నిందితుడు శ్రీధర్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. నిందితుడు విజయ్‌ని కోర్టులో హాజరపరచి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ రామస్వామి, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

**కాణిపాకం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు,చిత్తూరురూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై నరసింహులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న నగదు భక్తునికి అప్పగింత



**కాణిపాకం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** జేబు నుండి పోగొట్టుకున్న నగదును తిరిగి భక్తునికి అప్పగించిన సంఘటన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శుక్రవారం చోటుచేసుకుంది. రాజమండ్రికి చెందిన దుర్గాప్రసాద్ అనే భక్తుడు శుక్రవారం కుటుంబసభ్యులతో కలసి కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చారు, ఈసందర్భంగా ఆలయ దర్శనానికి వెళుతూ జేబునుండి సెల్‌ఫోన్ తీసే క్రమంలో జేబులో వున్న 11 వేల రూపాయలు కిందపడిపోయింది. ఈవిషయాన్ని గమనించిన కొబ్బరికాయలు అమ్ముకునే స్థానిక మహిళా వ్యాపారస్థులు దేవస్థానం హోంగార్డు ఇన్‌చార్జి పిఎల్‌సీ వినాయకంకు విషయాన్ని తెలియజేసి భక్తుడు పోగొట్టుకున్న నగదును అప్పగించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆర్టిఐపై అవగాహన తప్పని సరి




**గంగాధరనెల్లూరు, అక్టోబరు 10 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరికి ఆర్టిఐపై అవగాహన తప్పని సరి అని జాతీయ అధ్యక్షులు బండి పట్టాభిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్టిఐ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జాతీయ ఆర్టిఐ ఉపకార్యాలయం నుంచి పట్టణ వీధుల్లో ఆర్‌టిఐ అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం స్థానిక ఎంపిడిఓ మనోహర్ గౌడ్‌ని సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరు ఆర్టిఐ గురించి అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సలహాదారు డాక్టర్ తిలక్, త్యాగరాజురెడ్డి, రామ్‌రాజ్, నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి గిరిబాబు కోదండ రెడ్డి లోకనాధ నాయుడు, సుధాకర్, ధనంజయరెడ్డి, విశ్వనాధరెడ్డి, స్టీఫెన్, జైపాల్ చిరంజీవిలతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## జీఎస్టీపై సంస్కరణలు చారిత్రకం డిప్యూటీ కమిషనర్

**పుంగనూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం గత నెల 22 నుంచి జీఎస్టీ విధానంలో తీసుకువచ్చిన సంస్కరణలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పలమనేరు జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ వి ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఎస్సార్ డిష్ అండ్ మీడియా షోరూం వారు ఏర్పాటుచేసిన జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న చిన్న స్టాళ్లను ఏర్పాటు చేసి, తగ్గిన జిఎస్టి ధరలపై పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్సార్ డిష్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ముఖ్య అతిథిగా పుంగనూరు పట్టణ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, కార్యక్రమంలో ఎండి ఎలక్ట్రానిక్స్, శ్రీ గణేష్ ఆటోమొబైల్స్, అధినేత టీవీఎస్ ప్రసాద్, ఆర్కే ఎంటర్ప్రైజెస్ ఆనంద్ కుమార్ పాల్గొని తగ్గిన జీఎస్టీ ధరలపై ,స్టాళ్ల ఏర్పాటు చేశారు.



## టపాకాయల దుకాణ ఏర్పాటులో జాగ్రత్త



**పుంగనూరు,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** దుకాణాలు పెట్టి టపాకాయలు విక్రయించడం వ్యాపారుల లక్ష్యం కాకూడదని ప్రజలకు భద్రత కల్పించడం అత్యంత అవసరమని పుంగనూరు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు సూచించారు. దీపావళి సందర్భంగా నియోజకవర్గంలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారస్తులతో శుక్రవారం ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.అనుమతి లేకుండా లేదా పరిమితికి మించి టపాకాయలను నిల్వ చేస్తే దుకాణాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

## జీఎస్టీతో సామాన్యులకు వెసులుబాటు

**చౌడేపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** ప్రభుత్వం కల్పించిన జీఎస్టీ 2.0తో సామాన్యులకు ధరలు అందుబాటులోకి వచ్చాయని ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ షబ్బీర్ అహమ్మద్ అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిపాలనా భవనంలో సచివాలయ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోనిపంచాయతీకార్యదర్శులు, సచివాలయ అధికారులు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమాజసేవలో ఆనందాన్ని చూస్తా : ఎస్కేఆర్



***చౌడేపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:*** సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసినట్లు బోయకొండ మాజీ ఛేర్మన్, శ్రీహరిహర హనుమదీశ్వర, అయ్యప్ప సాయి రాం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షు డు ఎస్కే. వెంకట్రమణారెడ్డి అన్నారు. మండలంలోని ఏ.కొత్తకోటలోని దేవాలయాల తోటలో తన పుట్టిన రోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకొన్నారు. కూటమి ప్రభుత్వం మరో 20యేళ్లపాటు అధికారంలో వుంటుందనీ, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, పవన్‌కళ్యాణ్ ఉపముఖ్య మంత్రిగా సేవలందిస్తారన్నారు. బోయకొండ మాజీ ఛేర్మన్ రతీదేవి, సోమల ఎఎంసి ఛేర్మన్ శ్రీనివాసులు నాయుడు, తేదేపా సీనియర్ నాయకుడు జల్లి మనోహర్, బిజెపి అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్, ఏటవాకిలి సోమశేఖర్‌రెడ్డి, బల్లాపురం నరేష్, జల్లి చరణ్, కూటమి పార్టీల నాయకులు, ఎస్కేఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## బోధనేతర కార్యక్రమాలకు స్వస్తిపలుకుతాం

**చౌడేపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** మితిమీరిన బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో మండల నాయకుడు లింగమూర్తియాదవ్ అన్నారు. ఈమేరకు స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఇఓ కేశవరెడ్డికి వినతిపత్రాన్నందించారు. ఫ్యాప్టో నాయకులు జగన్మోహన్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, మునిరాజ, బాబురమేష్, సుమిత్ర, హరినాథ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టీ తగ్గింపు పేద.. మధ్యతరగతి ప్రజలకు వరం

**కుప్పం,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టీ శ్లాబులు పేద, మధ్యతరగతి ప్రజలకు వరంలాంటిదని ప్రభుత్వ విప్,కడపిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ కేంద్రప్రభుత్వం దసరా కానుకగా జిఎస్టీశ్లాబ్ శాతాన్ని తగ్గించడంతో దేశంలోఅన్నివర్గాల ప్రజలకు,రైతులకు ఇదివరకు కంటేతక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, టిటిడి బోర్డు సభ్యుడువైద్యం శాంతారా ం, వాణిజ్య పన్నుల శాఖ ఎ.సి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ పిఎసి సభ్యుడు రాజ్‌కుమార్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సతే య్రంద్రశేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, గణపతి, మంజు, నబీ పాల్గొన్నారు.



## మున్సిపల్ కమీషనర్‌కు ఘన సన్మానం



**కుప్పం, అక్టోబర్ 10ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర 2025 అవార్డును అందుకున్న కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావును శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

## గోడకూలి ఆవు మృతి..ఇళ్లల్లో చేరిన నీరు

***కుప్పం, అక్టోబర్10 ప్రభాతవార్త:*** కుప్పం పట్టణంలో గురువారం రాత్రి వర్షం దంచికొట్టింది. దాదాపు 89మి.మీ.ల మేర వర్షపాత ం నమోదైంది. పట్టణంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆవుమృతి చెందిన విషయం తెలుసుకున్న కమీషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ జిమ్‌దాము సంఘటనా స్థలికి చేరుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలి కాలంలో ఎన్నడూలేని రీతిలో భారీ వర్షంకురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## డప్పు కళాకారుల సంఘ ఏర్పాటుకు కృషి



**కుప్పం,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** డప్పు కళాకారుల సంఘం ఏర్పాటుకు కృషి చేస్తానని కళాకారులు ఐకమత్యంగా ఉండాలని క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాజావారి పార్కులో జరిగిన డప్పుకళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డప్పు కళాకారుల సమస్యలను ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్‌సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## జిఎస్టీపై అవగాహన కార్యక్రమం

**రామకుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** రామకుప్పంలో శుక్రవారం జిల్లా జిఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ ఇంతియాజ్ అహ్మద్ అధ్వర్యంలో జిఎస్టీపైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మెడికల్ కళాశాల ప్రైవేటీకరణపై సంతకాల సేకరణ



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ వైకాపా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరడ్డి సారథ్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కోటి సంతకాల సేకరణకు రూపొందించిన పోస్టర్లను శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తి మండల పార్టీ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూధనంరెడ్డి, ఇతర మండలాల నాయకులు గున్నేరి కిషోర్‌రెడ్డి, కోగిలి సుబ్రమణ్యం, షేక్ సిరాజ్‌బాసా, సూరాగారి సురేష్, గోరా, ఉత్తరాజి శవరణ కుమార్, పఠాన్ ఫరీద్‌ఖాన్, శంకర్, మునికృష్ణారెడ్డి, పసల కృష్ణయ్య, వయ్యాల మనోహర్‌రెడ్డి,పులి రామచంద్ర,కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పఆల్గొన్నారు.

## బీమా యోజనలో ఆర్థిక సహాయం




**శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం బాధితులను ఆదుకొనుటకు రూపొందించిన ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో శ్రీకాహళస్తి మండలం గంగల పూడి గ్రామానికి చెందిన బాధితునికి రూ.2లక్షల చెక్కును పల్లంలోని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ఎన్.శివ మానంది అందించారు. మండలంలోని గంగల పూడి గ్రామంలో బి.ధనమ్మ అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న వీడ్స్‌సిఎఫ్ఎల్ కౌన్సిలర్ చిగురుపాటి కిరణ్ బ్రాంచి మేనేజర్‌కు సమాచారం అందించారు. నామిని బి.మహేష్‌కు శుక్రవారం రూ.2లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమాల్లో కె.చెంచయ్య, కిరణ్‌కుమార్, వినోద్‌కుమార్, సుప్రియ తదితర్గులు పాల్గొన్నారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య డే




**శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్యడేను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటి సారథ్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా మానసిక ఆరోగ్యం గురించి నినాదాలు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్‌వై. మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ కె.మణి,డాక్టర్లు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 2 రత్నకుమారి,మండల న్యాయ అధికార సంఘానికి చెందిన గరికపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన గణపతి ఆలయ నిర్మాణానికి అడ్డంకులేమి?



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న నవసంధి వినాయక ఆలయాల్లో బేరి వారి మండపం వద్ద విజ్ఞాన వినాయకునికి కొత్త ఆలయం నిర్మించటానికి బాలాలయం ఏర్పాటు చేసి ఇంత కాలమైతే ఇంకా ఎందుకు కొత్త ఆలయ నిర్మాణం చేపట్టలేదని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆలయ ఇఇ మురళీ ధర్‌రెడ్డితో కలిసి ఆలయ ప్రదేశాన్ని పరిశీలించారు. ఇక ఆలస్యం చేయక ఆలయాన్ని నిర్మించాలని సూచించారు. ఎంఎల్ఏతో పాటు మీడియా ఇన్‌చార్జి నాగమల్లి దుర్గా ప్రసాద్ పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, మాజీ కౌన్సిలర్ బషీర్ పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై అవగాహన ఎంతో అవసరం




**తొట్టంబేడు,అక్టోబర్ 10 ప్రభాతవార్త:** విద్యార్థి దశ నుంచే బాల్యవివాహాలపై అవగాహన కల్గి ఉండాలని వన్‌టౌన్ సిఐ డి.గోపి వివరించారు. శుక్రవారం పట్టణంలోని కొత్త పేటలో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు మహిళలపై ఆకృత్యాలు పెచ్చుపెరిగిపోతున్నాయన్నారు.దీనికి కారణం మహిళలకు చట్టాలపై అవగాహన లేకపోవటమే అన్నారు. నేరాలు,డ్రగ్స్‌కు సంబంధించి సమాచారం అందినపుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## పుత్తూరులో ఫ్రెషర్స్‌డే

**పుత్తూరు రూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** పుత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు పరిచయ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి పేర్కొన్నారు. నూతన విద్యా విధానం, సెమిస్టర్ పద్ధతి, కళాశాల మౌలిక వసతులు, సౌకర్యాలు గురించి వివరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్ష

పుత్తూరు రూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సీజనల్ వ్యాధుల నియంత్రణపై మున్సిపాలిటీ పరిధిలోని పలు శాఖల అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.కమిషనర్ మంజునాథగౌడ్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## వైభవంగా సంకటహర చతుర్థి

**పుత్తూరు రూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని పలు వినాయక స్వామి ఆలయాల్లో శుక్రవారం సంకటహర చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బెస్తవీధిలో వెలసిన తరుణ గణపతి ఆలయం, జెండా మాను వీధిలోని సెల్వ గణపతి ఆలయం, అలాగే మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కూడా సంకటహర చతుర్థి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఇంటి స్థలాల పట్టాల మంజూరుకు నిరసన

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 10 ప్రభాతవార్త:** వెస్ట్ వరత్తూరు దళితులకు ఇంటి స్థలాలు పట్టాలు మంజూరు చేయాలని మండల సీపీఎం కార్యదర్శి, నలుగురి రమణయ్య ఆధ్వర్యంలో వరత్తూరు దళితులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ వెస్ట్ వరత్తూరు దళితుల గ్రామం సమీపంలో ప్రభుత్వ భూములు ఇంటి స్థలాల కోసం దళితులు సర్వే నెంబరు 112లో మూడు ఎకరాల 75 సెంట్లు ప్రభుత్వ భూములు దళితులు 40 సంవత్సరాలుగా తమ స్వాధీనంలో ఉంచుకుని ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో దళితులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బాలికా దినోత్సవం వేడుకలు

**శ్రీసిటీ (తడ)అక్టోబర్ 10 ప్రభాతవార్త**




అంతర్జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు తడ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం శుక్రవారం సూళ్లూరుపేట జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వేములు, డాక్టర్ లావణ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు హరిత పాల్గొన్నారు పాఠశాల విద్యార్థినీలతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాధాన్యత గురించి వివరించారు మహిళలు అన్ని రంగాలలో రాణించాలంటే సమాజంలో గౌరవం పొందాలంటే పురుషులతో సమానంగా రాణించాలంటే విద్యతోనే సాధ్యమని విద్యతో జీవితంలో మార్పు వస్తుందని ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలంటే విద్య ఒక్కటే సరైన మార్గమని విద్యార్థినీలను చైతన్య కలిగించారు డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు.

## తల్లి ఒడికి బాలుడు

–సురక్షితంగా చేర్చిన పోలీసులు



**తిరుపతి, అక్టోబర్ 10ప్రభాతవార్త:** తల్లిదండ్రుల నుండి తప్పిపోయిన బాలుడ్ని మహిళ శక్తి టీమ్ పోలీసులు మానవతాదృక్పథంతో సమాజసేవతో తిరిగి తల్లి ఒడికి చేర్చారు. శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుందిన నంద్యాలజిల్లా గుడివేములకు చెందిన తండ్రి సుధాకర్ గతనెల 27న తిరుపతికి వచ్చాడు.తిరుపతిలో చింటూ వారినుండి తప్పిపోయాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శక్తిటీమ్ పోలీసులు ఎప్పటిలాగే శుక్రవారం విధుల్లో ఉండగా గుర్తించారు. బాలుడ్ని ఆప్యాయంగా పలకరించి అనంతరం శిశుమహిళ కేంద్రంలో ఉంచారు.తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో సాయంత్రం తిరుపతికి చేరుకుని బిడ్డను తీసుకున్నారు. మహిళ పోలీసుల సేవానిరతిని ఆ తల్లిదండ్రులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. టీమ్‌సేవలను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, మహిళ డిఎస్పీ శ్రీలత, సిఐ తమిమ్‌అహమ్మద్ అభినందించారు.

## కల్యాణ వెంకన్నే కాపాడారు..!

ఆలయంలో వేపచెట్టు విరిగిపడింది-భక్తులకు తప్పిన ప్రమాదం..!



**చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తన భక్తులను కాపాడుకున్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలోని వేపచెట్టు కొమ్మ ఒకటి పెళపెళమంటూ విరిగిపడింది. ఈ సమయంలో భక్తులు చెట్టు క్రింద ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆలయ ఆవరణలోని రేకులపై చెట్టుకొమ్మ పడటంతో ఇనుపపైపులతో సహ రేకులు ధ్వంసమయ్యాయి. చెట్టు బలహీనత కారణంగానే కొమ్మవిరిగిపడినట్లు భావిస్తున్నారు. అయినప్పటికీ ఇంతటి ప్రమాద సమయంలో భక్తులను భగవంతుడే కాపాడుకున్నారు.

## ఆహారపు అలవాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి..!



**చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** తలిదండ్రులు తమ పిల్లల ఆహారపు అలవాట్లపై ప్రత్యేక సారించాలని ఐసిడిఎస్ సిడిపిఒ పి.ఆర్.ప్రదీప అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబానికి పునాది అనే కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా వుంచాలన్నారు.ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ధన, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

## సహకార సంఘం చైర్మన్ కు ఘన సన్మానం



**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 10 ప్రభాతవార్త:** కాటూరు సహకార సంఘం చైర్మన్ ఎల్లంపల్లి భాస్కర్‌యాదవ్‌ను స్వగ్రామంలోని గాజుల పెళ్లూరులో తెలుగుదేశం నాయకులు ఘనంగా సన్మానించారు. గజమాలతో సన్మానించి పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. చైర్మన్‌గా పార్టీ నియమించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీ కోసం పని చేసి ఉన్నత పదవులను అలంకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్‌నాయుడు, పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆయుధపూజ

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 10 ప్రభాతవార్త:** విజయదశమి పర్వదినాలను పురస్కరించుకుని మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో కార్యాలయాన్ని అలంకరించి ఘనంగా నిర్వహించారు. పురోహితులు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా వెంకట రత్నమ్మ



**బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 10 ప్రభాతవార్త:** మండల అభివృద్ధి అధికారిగా శుక్రవారం ఎంపీడీవో వెంకటరత్నమ్మ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. శిక్షణ తరగతులు పూర్తి కావడంతో తిరిగి మరల ఎంపీడీవో రత్నమ్మ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ శిక్షణ తరగతుల వలన ఎన్నో విషయాలు తెలుసుకోవడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

## తైక్వాండోలో ఎస్వీఆర్ట్స్ కళాశాల విద్యార్థులు సత్తా



**తిరుపతి విద్య అక్టోబర్ 10 ప్రభాతవార్త:** ఎస్వీ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ మెన్ జూడో, కరాటి,తైక్వాండో టోర్నమెంట్ పోటీలలో స్థానిక బాలాజీ కాలనీలో ఉన్న ఎస్వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు సత్తాచాటి, మెడల్స్ సాధించారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. తిరుపతి ఎస్వి యూనివర్సిటీ గ్రౌండ్లో నిర్వహించిన ఇంటర్ కాలేజీ మెన్ జూడో కరాటే,తైక్వాండో చాంపియన్ షిప్ 2025 పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనపరచి 17 మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ విజయంలో శిక్షణ కీలక పాత్ర పోషించిన ముస్తాక్ అహ్మద్ ను యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.విజేతలైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జున రావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ ముస్తాక్ అహ్మద్, భీమన్న,తదితర ఉపాధ్యాయులు అభినందించారు

## జిఎస్టి 2.0 ఎగ్జిబిషనుకు ప్రజాధరణ




**తిరుచానూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** తిరుచానూరు రోడులోని శిల్పారామం లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసినటువంటి జిఎస్టి 2.0 ఎగ్జిబిషన్ ప్రజలు నుండి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం జిఎస్టి రేట్లకు అనుబంధంగా తిరుపతి శిల్పారామంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషనుకు తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ రాజు,రాష్ట్ర నాయకులు కే వి చౌదరి, వాసవి ఏజెన్సీ అధినేత ఏవి రమణ కుమార్, తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ రాజు, రాష్ట్ర నాయకులు కేవి చౌదరి, వాసవి ఏజెన్సీ అధినేత ఏవి రమణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మనిషిని సన్మార్గంలో నడిపేది దివ్యఖుర్ ఆన్ : రేహాన్



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** మనిషిని సన్మార్గంలో నడిపేది దివ్యఖుర్ ఆన్ అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఎలా నడచుకోవాలనే అంశాన్ని దివ్యఖుర్ ఆన్ స్పష్టంగా పేర్కొందన్నారు. సన్మార్గంలో నడచి స్వర్గస్తులు కావటానికి సూచనలు చేసిందన్నారు. అల్లాహ్ ఆదేశాలు సత్యసంధతను అలవాటు చేసుకోవాలన్నారు. ఈమాన్, నమాజు, హజ్, జకాత్, రోజాలను తప్పక ఆచరించాల్సి ఉందన్నారు.

## డాక్టర్ రమణారెడ్డికి మాతృవియోగం

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త :**



పట్టణంలో డాక్టర్ రమణారెడ్డికి మాతృవియోగం సంభవించింది. ఆయన మాతృమూర్తి వయ్యాల కాంతమ్మ ఆకస్మికంగా మృతి చెందింది. ఆమె మృతదేహానికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి వారి సహచరులతో నివాళులర్పించారు. కాగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ వారి సహచరులతో కాంతమ్మకు నివాళులర్పించారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి వారి సహచరులతో నివాళులర్పించి డాక్టర్ రమణారెడ్డిని వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఓదార్చారు.

## శివయ్య సేవలో సంకట హర చతుర్థి హోమాలు



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త :** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శుక్రవారం సంకటహర చతుర్థి పూజలు,హోమాలు నిర్వహించారు. ఆలయానికి చెందిన ఎస్ఎంకె శ్రీనివాసు గురుకుల్ సారథ్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలు ఏర్పాటు చేసారు. శ్రీనివాసు గురుకుల్ శాస్త్రోక్తంగా హోమాలు పూర్ణాహుతి గావించారు. గతంలో సంకటహర చతుర్థి పూజలను ఆలయం తరపునే నిర్వహించేవారు. అయితే దీనిని కూడా సేవగా మార్చారు. భక్తులకు అవకాశం కల్పించారు. ప్రతి నెల భక్తులు ఈ పూజలు,హోమాలు జరుపుకుంటున్నారు. ఆలయం తరపున టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ సంకల్పంతో పూజలు నిర్వహించారు.పూర్ణాహుతితో పూజలు ముగిసాయి.

## ఎంఎల్ఏలచే రాహుకేతుదోష పూజలు



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలను శుక్రవారం హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు జరిపించుకున్నారు. ధర్మశాల ఎంఎల్ఏ సుధీర్‌శర్మ, హమీర్‌పూర్ ఎంఎల్ఏ ఆశిష్ శర్మలు రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనాలు ఏర్పాటు చేసారు.వారికి ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## భాణసంచా అక్రమంగా నిలువ చేస్తే కఠిన చర్యలు : సిఐ



**పాకాల, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** పాకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ ప్రసాద్ శుక్రవారం మండల పరిధిలో ఎవరైనా భానా సంచా (టపాకాయలు)ను జనావాస ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేస్తేగాని, రవాణా చేస్తేగాని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోల్సేల్ వ్యాపారులు ముందుగా సంబంధిత అధికారుల అనుమతులు పొందాలని ఆయన కోరారు. జనావాసాలకు దూరంగా, సురక్షితమైన ప్రాంతాల్లో మాత్రమే నిల్వ చేయాలని సూచించారు. అధికారులు నిర్దేశించిన ప్రదేశాలలోనే నిబంధనల మేరకు అమ్మకాలు జరగాలని స్పష్టం చేశారు. భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదన్నారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై అవగాహన



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, మానసిక విభాగ అధిపతి డాక్టర్ పద్మావతి, డాక్టర్ మల్లికార్జున రావు రోటరీ క్లబ్ మెంబర్స్ సైకియాట్రీ అసోసియేషన్ మెంబర్స్ డాక్టర్ కిషోర్, డాక్టర్ పెరోల్ యాదవ్ మరియు రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో వైద్య కళాశాల పరిపాలన భవనం నుంచి, సిమ్స్ వరకు ర్యాలీని నిర్వహించారు. మానవహారంతో, నినాదాలు చేస్తూ శారీరిక ఆరోగ్యం కన్నా మానసిక ఆరోగ్యం మిన్న, మానసిక ఆరోగ్యమే మహబలం , బలమైన మనసు బలమైన ప్రపంచం మానసిక ఆరోగ్యంగా ఉంటే ఏ పనైనా చేయగలుగుతామని దృఢ సంకల్పం. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సైకియాట్రి అసోసియేషన్ డాక్టర్ కిషోర్, డాక్టర్ పెరోల్ యాదవ్, మానసిక విభాగము అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. మల్లికార్జున్ రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత, డాక్టర్ భారతి డాక్టర్ మానస మెడికల్ ఆఫీసర్, డాక్టర్ జి మురళి కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, ఎస్ రమణయ్య పీజీ, యూజీ వైద్య విద్యార్థులు, డాక్టర్ మురళి, డాక్టర్ వెంకటరత్న, డాక్టర్ ఎస్ఎస్‌సిని, డాక్టర్ కళ్యాణ్ డాక్టర్ ప్రవీణ్ విద్యార్థులు, ఎమ్మెస్సీ, బిఎస్సి నర్సింగ్ విద్యార్థినిలు, వైద్య సిబ్బంది, పిఆర్ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



**తిరుపతి రహణా, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరియు వయోవృద్ధుల జిల్లా సంక్షేమంశాఖ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వయో వృద్ధుల ను సన్మానిస్తున్న స్థానిక శాసన సభ్యులు ఆరని శ్రీనివాసులు,మాజీ శాసన సభ్యులు, పట్టణ సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి సుగుణమ్మ,ఏపీ హ్యాండిక్రాఫ్ట్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్,ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాయక్ రూయ సూపరింటెండెంట్ డాక్టర్ రాధ ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్య క్షులు ఆర్. శంకర్ మరియు విభిన్న ప్రతిభావంతులు వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరు రైల్వే స్టేషన్ కు మహర్దశ!




**రేణిగుంట, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** నూతనంగా ప్రారంభపడిన తిరుచానూరు రైల్వే స్టేషన్ కు భవిష్యత్తులో మహర్దశ వస్తుందని చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ అన్నారు. తిరుచానూరు రైల్వే స్టేషన్ నందు శుక్రవారం జరిగిన పాత్రికేయులు సమావేశంలో సిసిఐ కిరణ్ మాట్లాడుతూ తిరుపతి రైల్వే స్టేషన్లో ఏర్పడిన రద్దీ దృశ్య కొన్ని రైళ్లను రైల్వే శాఖ తిరుచానూరు రైల్వే స్టేషన్ వరకు నడపడం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రెండు ప్యాసింజర్ రైళ్ల తిరుచానూరు రైల్వే స్టేషన్ నుండి ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి అన్నారు. మరో ఐదు స్పెషల్ ట్రైన్స్ దేశంలోని వివిధ ప్రాంతాలకు శ్రీవారి భక్తుల అవసరాల అవసరాల మేరకు నడుపుతున్నామన్నారు. తిరుచానూరు రైల్వే స్టేషన్ తిరుపతి రేణిగుంట జాతీయ రహదారి పక్కన ఉండడం వల్ల ప్రయాణికులకు తిరుమల చేరుకోవడం సులభతరం అవుతుందన్నారు. సమావేశంలో రేణిగుంట చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ చలపతి, తిరుపతి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, మురళి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్సై రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేను ప్రజా సేవకుడను...ఎమ్మెల్యే బొజ్జల



**రేణిగుంట, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వారసుడిగా తాను ఎప్పటికీ ప్రజా సేవకుడనేనని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మరో మారు నొక్కి వక్కాణించారు. రేణిగుంట మండలం మామండూరు గ్రామం నందు ఏనుగుల వల్ల మామిడి పంట నష్టపోయిన రైతులకు శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నష్టపరిహారం అందజేశారు. 16 మంది రైతుల మామిడి పంటను ఏనుగులు ధ్వంసం చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే జోక్యంతో రైతులకు ప్రభుత్వం తరఫున 2,25,500 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. తెలుగుదేశ కూటమి ప్రభుత్వంలో ఎవరికి నష్టం జరగదని తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట క్లస్టర్ ఇంచార్జ్ పుష్ప నాదం, తిరుపతి టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా టిడిపి రైతు నాయకులు మునుస్వామి నాయుడు, కుమారు, స్థానిక టిడిపి నేత విశ్వనాథ్ యాదవ్, టిడిపి సీనియర్ నేతలు నాదముని రెడ్డి, మేరీ, సుమన్, ముని రాజా తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే పెన్షనర్స్ సమస్య పరిష్కారించాలి



**రేణిగుంట, అక్టోబర్ 10 ప్రభాతవార్త :** రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారాల కోసం భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీలకు వినతి పత్రం పంపాలని రైల్వే విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం సిఆర్ఎస్ ఇంచార్జ్ సి డబ్ల్యు ఎం.ప్రమోద్ కుమార్‌ను కలిసి అర్జీ సమర్పించారు. అర్జీ ఇచ్చిన వారిలో ఆర్ ఎం విజయ్ కుమార్ తో పాటు సురేంద్ర రెడ్డి, కృష్ణ దాస్, రెడ్డి, గజపతి నాయుడు, జబ్బార్, రామ్మూర్తి, తదితరులు ఉన్నారు.

## టపాసులు సీజ్ చేసిన అర్బన్ పోలీసులు



**రేణిగుంట అక్టోబర్ 10 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు కు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు రేణిగుంట శ్రీనివాస రావు సూచనల మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వ హించి అక్రమంగా టపాసులు , బాణాసంచా రవాణా చేస్తున్న లారీని రేణిగుంట చెక్‌పోస్ట్ వద్ద రెవెన్యూ, ఫైర్ సర్వీస్ అధి కారులు సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. తమిళ నాడు రాష్ట్రం శివకాశి నుండి తిరుపతి మెట్రో ట్రాన్స్పోర్ట్‌కు టపాసులు పంపుతున్నట్లు పోలీసుల విచార ణలో తెలిసింది. లారీలోని సరుకులు సీజ్ చేశారు. అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

## మహాదేవయ్యను ఉద్యోగంలోకి తీసుకోవాలి

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమం కోసం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సానుకూల సిఫార్సులను అమలు చేయని కారణంగా కామ్రేడ్ మహదేవయ్య నాయకత్వంలోని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో తక్షణమే కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సుల అమలు చేయాలని డిమాండ్ చేశారు.



అనంతరం తపాలా శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చిన మేరకు ఆ సమ్మెను నిలిపివేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్. శ్రీధర్ బాబు, కామ్రేడ్ బి.మధు బాబు, కామ్రేడ జె.మదన్ మోహన్ రెడ్డి, కామ్రేడ్ కె.నాగయ్య తదితర నాయకులు పెద్ద ఎత్తున నిర్వహించారు.

## ప్రసన్న వెంకటేశ్వరుని సేవలో హైకోర్టు జడ్జిలు



**వడమాలపేట, అక్టోబరు 10 ప్రభాతవార్త:** వడమాలపేట మండలంలోని అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని ఆంధ్రప్రదేశ్ హై కోర్టు న్యాయమూర్తులు శుక్రవారం దర్శించుకున్నారు. జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ రవి చీమలపాటిలు కుటుంబ సభ్యులతో కలిసి అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరుని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్ న్యాయమూర్తులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓకు ఘన సన్మానం



వాకాడు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు మండల విద్యాశాఖ కార్యాలయంలోని వాకాడు సెయింట్స్ ఫాల్స్ అప్పర్ ప్రైమరీ పాఠశాల కరస్పాండెంట్ వైఎం.సుమంత్ శుక్రవారం ఎంఈఓ ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన మేరకు విద్యతో పాటు, మౌలిక వసతులు విద్యార్థులకు ఉండాలని సూచించారు. ఈ సత్కారంలో ఎంఈఓ సిబ్బంది, సెయింట్స్ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులు భవిష్యత్తుపై దృష్టి పెట్టండి




వాకాడు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: విద్యార్థిని, విద్యార్థులు మత్తు పదార్థాలను వదిలి, చదువుకొని అత్యున్నత ఉద్యోగాలు చేసి బంగారు భవిష్యత్తును కోరుకోవాలని మెరైన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన వాకాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కాలేజ్ ఆవరణంలోని డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుచోట్ల చిన్న వయసులో విద్యార్థులు మత్తు పదార్థాలు వాడకం తో భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మిమ్మల్ని బయట వ్యక్తులు వచ్చి ప్రేరేపిస్తే వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌కు, పోలీస్ స్టేషన్‌కు, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని సూచించారు. ఈ సమావేశంలో మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ శివ సౌమ్య, కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, మరైన్ సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో ప్రాంగణ ఎంపికలు

కోట,అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండలం విద్యానగర్ ఎన్‌బీకేర్ ఐఎస్‌టిలో శుక్రవారం స్పావిస్ హైదరాబాద్‌కు చెందిన కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బిటెక్ ఫైనల్‌యిర్ చదువుతున్న సిఎస్‌సి,ఈసిఇ ,ఐటి, ఎఐడిఎస్ విద్యార్థులకు నిర్వహించారు. మొత్తం 430 మంది ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. మొదటి రౌండ్‌లో 76 మంది ఎంపికైయ్యారు. ఈ విధంగా టిక్నికల్,కూడా ఎంపికైన వారుని తరువాత హెచ్‌ఆర్ రౌండ్‌లో కంపెని ప్రతినిధులు ఎంపిక చేస్తారని డైరెక్టర్, డాక్టర్, వి.విజయకుమార్ రెడ్డి చెప్పారు.కళాశాల ప్లెస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్,ఎన్.కిషందర్ పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాలపై కఠిన చర్యలు



కోట,అక్టోబర్ 10 ప్రభాతవార్త: ఏలాంటి అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయాలు,తయారీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని కోట మండల తహిసీల్దార్, కె.జయజయరావు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని చెందోడు, వెంకనపాళెం గ్రామాల్లో టపాసుల దుణాలను తహిసీల్దార్, అగ్నిమాపక అధికారి, శ్రీనివాసుల సంయక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహిసీల్దార్, కెజయజయరావు మాట్లాడుతూ దుకాణల్లో అనుకోకుండా మంటలు చెలరేగితే వాటిని ఆర్పేందుకు తగిన అగ్నిమాపక పరికరాలు,నీటి నిల్వ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్సీ బల్లి



వెంకటగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త: వెంకటాచలం మండలం, ఈదగాలి గ్రామంలోని విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా రాష్ట్ర ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి కలిశారు. పలు అంశాలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు.

## రెండు రోజులు సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

బాలాయపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 14,15 తేదీల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయితీల అభివృద్ధిపై శిక్ష వేస్తున్నట్లు పంచాయితీల అభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో డి. నారాయణ తెలిపారు. శిక్షణ తరగతులకు తప్పనిసరిగా సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

## ఎన్‌బికెఆర్‌లో ఆవిష్కార్-2కె25 సదస్సు




కోట, అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శుక్రవారం ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో ఆవిష్కార్-2కె25 సాంకేతిక జాతీయ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆవిష్కార్ అనేది సాంకేతిక మరియు సృజనాత్మక కలయిక అని పేర్కొన్నారు. భవిష్యత్‌లో పరిశోధకులుగా ఆవిష్కర్తలుగా ఎదగడానికి ఇలాంటి సదస్సులు ప్రేరణాత్మ కంగా పనిచేస్తాయన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో కొత్తదనాన్ని నేర్చుకోవడం, పంచుకో వడంలో విద్యార్థులు పోటీపడాలన్నారు. అనంతరం పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, స్పాట్ ఈవెంట్స్ వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఒడి డాక్టర్ జి.హరినాథరెడ్డి, కార్యక్రమాల కన్వీనర్ మురళీమోహన్‌బాబు, కోఆర్డినేటర్ రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12న బిజెఎంఎస్ జాతీయ అధ్యక్షులు జటావ్ రాక

గూడూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: ఈ నెల 12వ తేదీన ఆదివారం నాడు బిజెఎంఎస్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాష్ జటావ్ గూడూరుకి విచ్చేయుచున్నారని బిజెఎంఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నాలి మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. గూడూరు పట్టణ నియోజకవర్గంతో పాటుగా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడా కార్మికకర్షకులు పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎస్ఐపై ఆరోపణలు... డిఎస్‌పి విచారణ



కోట,అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండలంలోని చిట్టేడు గ్రామానికి చెందిన అనిల్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అయితే మృతుడు తల్లి ఉమామహేశ్వరి తన కుమారుడును కోట ఎస్ఐ పవన్ కుమార్ మందలించిన కారణంగా మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని వాకాడు సిఐ హుస్సెన్ బాషకు, గూడూరు డిఎస్‌పి గీతాకుమారికి పిర్యాదు చేసింది. ఈక్రమంలో శుక్రవారం రాత్రి గూడూరు డిఎస్‌పి గీతాకుమారి కోట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు.అనతరం నివేదికను జిల్లా ఎస్‌పి అందచేయడం జరుగుతుందన్నారు.

## గూడూరులో ప్రపంచ ఆరోగ్య మానసిక దినోత్సవం




గూడూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ మెంటల్ హెల్త్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మానసిక వైకల్యంతో 50కోట్ల మంది పైగా ప్రజలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, బార్ ప్రెసిడెంట్ ఉమా శంకర్, సీనియర్ అడ్వకేట్ గోపికృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కోటేశ్వరరావు, ఎస్సై తిరుపతయ్య, బీసీ హాస్టల్ వార్డెన్ సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## జీఎస్టీతో సామాన్య ప్రజలకు మేలు ఎమ్మెల్యే పాశం





గూడూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: జీఎస్టీతో సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ గూడూరు పట్టణంలోని జి.ఎస్ రాయలు కళ్యాణ మండపంలో సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా గ్రాండ్ ఎలక్ట్రానిక్ సేల్ ఎగ్జిబిషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, గూడూరు సర్కిల్ జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. స్థానిక గాంధీ బొమ్మ నుండి ర్యాలీ నిర్వహించి, ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, ఎలక్ట్రానిక్ వస్తువులను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు గతంలో ఎప్పుడూ లేదని, ఈ తగ్గింపు వల్ల ప్రజలు నిత్యం వినియోగించే నిత్యవసర సరుకులు మందులు ధరలు తగ్గాయని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సేల్ టాక్స్ ప్రాక్టీషనర్ కోటా సునీల్ కుమార్ ,సోమిశెట్టి చెంచురామయ్య, గుబ్బ చంద్రశేఖర్, వాయు గండ్ల సుధాకర్,వెంకటసుబ్బయ్య, సురేష్, కొండ భాస్కర్, ప్రసాద్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ సిబ్బంది నిరసన



గూడూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త: 2023 డిసెంబర్ నెలలో జరిగిన జీడీ ఎస్ సమ్మెకు నాయకత్వం వహించిన అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్ మహదేవయ్యని, ఆ సమ్మెకు నాయకత్వం వహించిన కారణంగా జనరల్ సెక్రెటరీని ఉద్యోగం నుండి తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంతో గూడూరు పోస్టాఫీస్ పోస్టల్ ఉద్యోగ సంఘాలు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ నిజంగా నేటి ఆధునిక తపాలా ఉద్యమంలో మరో చీకటి రోజు గానే పరిగణించాలని అన్నారు. రెండు రోజుల క్రితం మహాదేవయ్యపైన తీసుకున్న చర్యలు కూడా దీనిలో భాగమే అన్నారు. కేంద్ర, రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల వద్ద తక్షణమే కామ్రేడ్ మహాదేవయ్యపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను రద్దు చేయాలని కోరుతూ గూడూరు హెడ్ పోస్టుఆఫీస్ ముందు నిరసనలు చేపట్టడం జరిగిందన్నారు.

## పార్టీలో కష్టపడి పనిచేసిన వారికే పదవులు : ఎమ్మెల్యే





చిల్లకూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం కోసం నిరంతరం పనిచేసే అధికారంలోకి తీసుకొచ్చిన ప్రతి ఒక్క కార్యకర్తలకు ఈరోజు గుర్తించి పదవులు ఇవ్వడం సంతోషదాయకమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. చిల్లకూరు మండలంలోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్ వద్ద శుక్రవారం గూడూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఏడి సురేంద్ర బాబు చిల్లకూరు నీరజ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా సోమిశెట్టి చెంచురామయ్య డైరెక్టర్లుగా కొండ రామచంద్ర రెడ్డి, ఆరికట్ల మల్లికార్జున నాయుడు, గాలి ప్రకాష్ నాయుడు, కొండూరు కృష్ణమ్మ, మేకల కిషోర్, మనుబోలు కిష్టయ్య, షేక్ పర్వీన్, పంట నిర్మలమ్మ, నెలటూరు సుప్రజ, కొండూరు హేమలత, షేక్ మహమ్మద్ జాకీర్, కీర్తిపాటి సుధా, మల్లీ శ్యామల, పి. ప్రవీణ్ కుమార్ రెడ్డి, వేముల సునీల్‌లు అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొండేపాటి గంగా ప్రసాద్ తానంక జిల్లా సహకారంతో ఈ ఏఎంసీ కమిటీ చైర్మన్ డైరెక్టర్ ఎన్నుకోవడం సంతోషదాయమన్నారు.

గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం స్థానిక ఏఎంసి కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని తెలుగుదేశం పార్టీ గుర్తిస్తుందని, అందుకు ఉదాహరణే నేడు పారదర్శకంగా ఏర్పడ్డ ఈ కమిటి అని అన్నారు. అదేవిధంగా బిజెపి జనసేన పార్టీలకు కూడా ఈ కమిటీలు భాగస్వామ్యం అయ్యారని అన్నారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడిలు సురేంద్రబాబు, గోపినాయక్, నాయకులు ఆల్తూరు కరుణాకర్ రెడ్డి, చిల్లకూరు పట్టాభి రామ్ రెడ్డి, చల్లకూరు దసరాదమిరెడ్డి, మట్టం శ్రావణ రెడ్డి, గుండాల లీలావతి, గుండాల శ్రీదేవి, తీగల చంద్రశేఖర్, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్ రహీం పాపారెడ్డి, పురుషోత్తం రెడ్డి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమర ఆసుపత్రిలో అరుదైన గుండె శస్త్ర చికిత్సలు



రేణిగుంట,అక్టోబర్ 10 ప్రభాతవార్త : రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన అరుదైన మూడు గుండె శస్త్ర చికిత్సలను శుక్రవారం జపాన్ ప్రముఖ ఇంటర్వెన్షనల్ గుండె వైద్యులు డాక్టర్ సిరికావా టకేసి తో కలిసి అమరా వైద్య బృందం విజయవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందుతున్నారు. పూర్తిగా గడ్డకట్టి రాయిలా మారిన రక్తనాళాలలో సిపిఓ ప్రొసీజర్ ద్వారా శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించి ముగ్గురు వ్యక్తులకు ప్రాణదానం చేశారు. గడ్డ కట్టిన రక్తనాళాలను సాధారణ స్థితికి తీసుకురావడం ఛాలెంజ్ తో కూడిన పని అని అమర కార్డియాలజిస్ట్ డాక్టర్ శివకృష్ణ అన్నారు. శాస్త్ర చికిత్సలు చేసిన వైద్య బృందం నందు సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేష్ గురజాల, డాక్టర్ నౌషాద్, అమర ఆసుపత్రి సాంకేతిక సిబ్బంది ఉన్నారు.

### శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు...

## నూతన పాలకమండలి ప్రమాణం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు చైర్మెన్‌గా షేక్ ఖాదర్‌బాషా ప్రమాణస్వీకారం చేసారు. శుక్రవారం మహేష్ కళ్యాణ్ సదన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. బ్యాంకు సిఇఓ ధనంజయులు సారథ్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ సుదీర్‌రెడ్డి చైర్మెన్ ను దుశ్శాలువలతో సత్కరించారు.ఆయన మాట్లాడుతూ ఖాదర్‌బాషా తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కాలం నుంచి ఖాదర్‌బాషా తమ కుటుంబానికి విధేయుడుగా ఉన్నారన్నారు. అలాంటి సీనియర్ కార్యకర్తకు గుర్తింపు ఇవ్వటం తన బాధ్యతగా భావించి అవకాశం కల్పించామన్నారు. ఇలాగే పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని సుదీర్‌రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిధులుగా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతతి నాయుడు,విజయకుమార్‌నాయుడు,రావిళ్ల మునిరాజా నాయుడు, పేట బాలాజి గోపినేథ్, కాసరం రమేష్,మాజీ కౌన్సిలర్ బషీర్‌లు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.2.45లక్షలు



శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 10 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాలను శుక్రవారం లెక్కించారు. ప్రముఖ శైవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఆనందవల్లి పరశురామేశ్వరాలయంలె భక్తులు 34రోజుల్లో హుండీల్లోనూ, నిత్యాన్నదాన పథకానికి అందించిన కానుకలను శుక్రవారం లెక్కించారు.హుండీల ద్వారా రూ.2,20,902లు, అన్నదానానికి రూ,24,875 లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆలయానికి వస్తున్న భక్తులు,విఐపిల సంఖ్య పెరుగుతుందని, అలాగే హుండీల్లో వస్తున్న ఆదాయాలు పెరుగుతున్నాయన్నారు. ఈ లెక్కింపులో మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు, తిరుపతి దేవాదాయశాఖ డివిజన్ తనిఖీ అధికారి పణిరాజసేన, పోలీసులు,పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సంకటహరచతుర్థశి పూజలు





తిరుపతి,అక్టోబర్ 10ప్రభాతవార్త: ఆశ్వయుజమాసంలో సంకటహర చతుర్థశి వేడుకలను శుక్రవారం సాయంత్రం వినాయకసాగర్‌లోని వరసిద్ధివినాయకుని ఆలయంలో జరిపించారు.వరసిద్ధి ఆలయ కమిటీ సభ్యులు ధర్మకర్త కొండే చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి, సుధాకర్, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్, శాంతిప్రియ, రత్నజ, కినీశారెడ్డి, తన్విష్, సురేష్‌స్వామి తదితరులు సంకటహరచతుర్థశిన వినాయకునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం పూజలుచేసి ప్రసాద నివేదనతో భక్తులకు పంపిణీ చేశారు. కష్టాలు తొలగించి అందరికీ శుభాలు కలిగించు స్వామీఅని వేడుకున్నారు.

## ఆక్స్ఫర్డ్ విద్యార్థి... రాష్ట్రస్థాయికి ఎంపిక



రేణిగుంట అక్టోబర్ 10 ప్రభాతవార్త : రేణిగుంట పట్టణంలోని ఎస్ జి ఎఫ్ ఆక్స్ఫర్డ్ గ్రూప్ స్కూల్ నందు ఆరవ తరగతి చదువుతున్న యతీష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. యతీష్ చదువుతోపాటు ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని విద్యా సంస్థ ప్రిన్సిపాల్ గౌతమి, చైర్మన్ మురళీకృష్ణ తెలిపారు. విద్యా సంస్థకు వన్నెతెచ్చిన విద్యార్థి యతీష్‌ను పాఠశాల యాజమాన్యం, బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు.

## జిఎస్టీ 2.0 ఫలాలు అందరికీ అందాలి : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, అక్టోబర్ 10 ప్రభాతవార్త: జిఎస్టీ 2.0తో తగ్గిన ధరలు వినియోగదారులందరికి అందాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు.జిఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఆదా అవుతుందని ఆయన చెప్పారు.శిల్పారామంలో జిఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించడంలో భాగంగా వాణిజ్య పన్నుల శాఖ రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన సేల్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. వివిధ కార్పోరేట్ సంస్థలు, స్థానిక సంస్థలు ఏర్పాటు చేసిన గృహోపకరణ, ఏసి,సోలార్ ప్యానల్స్, టూ వీలర్స్,ఫోర్ వీలర్స్ స్టాల్స్‌ను అధికారులు,ఎన్డీఏ నాయకులతో కలిసి పరిశీలించారు. ధరల తగ్గింపుతో పెరిగే సేల్స్ ద్వారా వచ్చే ఆదాయంతో భర్తి చేసుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు చర్యలు తీసుకున్నారని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా శ్రీ రామ్ బజాజ్ వారు బజాజ్ బైకులు,కే టి ఎం బైకులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ఎమ్మెల్యే సందర్శించి ఇంతకు ముందు ఉన్న రెట్లు ఇప్పుడు ఉన్న రెట్లు గురించి బజాజ్ అధినేతలు శ్రీనివాస రావు,సాకేత్ రామ్,అభిరామ్ లను అడిగి తెలుసుకున్నారు. ఇప్పుడు జి ఎస్ టి తగ్గింది కథ అమ్మకాలు ఎలా ఉన్నాయి అని ఆరా తీశారు.జిఎస్టీని భారీగా తగ్గించడంతో పాటు జీవిత బీమాపై జిరో జిఎస్టీ చేసిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలదని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సుగుణమ్మ, నరసింహ యాదవ్,డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి,గంగమ్మ గుడి కమిటీ సభ్యురాలు మధులత తదితరలు పాల్గొన్నారు.

## అల్యూమినియం ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 10 ప్రభాతవార్త : ఏర్పేడు-వెంకటగిరి మార్గంలోని చింతల పాళెం వద్ద వెలసిన అల్యూమినీయం ప్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.ఇక్కడ అల్యూమినియం ఫ్యాక్టరీలో వందలాది మంది కార్మికులు పని చేస్తున్నారు.ఇక్కడ శుక్రవారం హఠాత్తుగా కంపెనీలో బాయిలర్లు పేలి ఎపెద్ద ఎత్తున మంటలు చోటు చేసుకున్నాయి. మంటలు ఎగిసి పడుతుండటంతో మేనేజ్‌మెంట్ వెంటనే స్పందించి అగ్నిమాపక దళశాఖకు సమాచారం అందించారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి నుంచి అగ్నిమాపక యంత్రాలను రప్పించారు. సమాచారం తెలిసిన వెంటనే శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి కంపెనీ యాజమాన్యంతో చర్చించారు. సంఘటనా స్థలానికి తెలుగుదేశం నాయకులు రంగినేని చెంచయ్యనాయుడును పంపారు.ఈ సంఘటనలో ఇద్దరు కార్మికులు గాయపడినట్లు తెలిసింది. వారిని వవెంటనే ఆసుపత్రికి తరలించారు.వారితో చరవాణిలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడారు. మేనేజ్‌మెంట్ కంపెనీ నిర్వాహకులతో మాట్లాడి కార్మికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యసదు పాయాలు కల్పించాలని ఆదేశించారు.

## స్విమ్స్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



తిరుపతి హెల్త్, అక్టోబర్ 10 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థలో సైకియాట్రీ విభాగం వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం శ్రీ పద్మావతి హాస్పిటల్ 1వ అంతస్థు నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలియజేశారు. స్విమ్స్ డీన్ డా. అలోక్ సచన్, సైకియాట్రిస్ట్ విభాగాధిపతి డా. గణేష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాంజలిల సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ వి.కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం విపత్తులు, అత్యవసర పరిస్థితులలో మానసిక ఆరోగ్య సేవలకు అందుబాటు అనే థీమ్‌తో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నాడు అవగాహన కార్యక్రమం ప్రతి సంవత్సరం మన స్విమ్స్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. స్విమ్స్‌లో అన్ని రకాల మానసిక వ్యాధులకు మరియు మత్తు పదార్థాల బానిస అయిన వారికి చికిత్స మరియు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది. డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ట్రీట్‌మెంట్ చేస్తున్నారని తెలియజేశారు. స్విమ్స్ సైకియాట్రీ విభాగపు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష

ఓజిలి, అక్టోబర్ 10 ప్రభాతవార్త : హత్య కేసులో నిందితుడికి 7వ అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకట నాగ పవన్ ఐదేళ్ల కఠిన కారాగార శిక్షణ శుక్రవారం విధించారు. ఫిర్యాదుదారుడు మర్రి ఓంకారం కుటుంబ సభ్యులపై 2017 ఏప్రిల్ 10వ తేదిన ఓజిలి మండలంలోని గొల్లపాలెం గ్రామం పరిధిలోని పొలాలలో సంచి వెంకటేశ్వర్లు, మరికొందరు కలిసి కట్టుగా సమూహంగా ఏర్పడి ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో గాయపడిన మర్రి పోలయ్య మరణించారు. ఏ1, ఏ3,ఏ6,ఏ9 నిర్దోషులుగా విడుదల కాగా ఏ7 మరణించిన వారిగా కేసు నిలిపివేసారు. ఓజిలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో సాక్ష్యాదారాలను సమగ్రంగా సేకరించి, న్యాయస్థానంలో నిరూపించినందుకు సంబంధిత దర్యాప్తు అధికారులు ఓజిలి ఎస్ఐ సత్యనారాయణ, ప్రస్తుత ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు లైజన్ ఆఫీసర్ మల్లికార్జున, కోర్టు కానిస్టేబుల్ సూర్యనారాయణ, పిపి బి. సుందరయ్యను, ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా ఎస్పి అభినందించారు. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, న్యాయస్థానంలో నేరాన్ని నిరూపించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత. తిరుపతి జిల్లా పోలీసులు దీనిని నిరంతర కృషితో సాధిస్తుందని జిల్లా ఎస్పి తెలిపారు.

## ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

### - బిసిఎన్ గ్రూప్స్ చైర్మన్ బిసి నాగరాజ్ - కెఇసిలో ఇక్సా2025 అంతర్జాతీయ సదస్సు!!



కుప్పం, అక్టోబర్ 10ప్రభాతవార్త : ప్రపంచ ంలో వేగవంతంగా టెకా ్నలజీ పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక సా ంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని బిసిఎన్ గ్రూప్స్ చైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో స్మార్ట్ సిస్టమ్స్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ కంప్యుటేషనల్ టెక్నిక్స్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు (ఇక్సా 2025) ను ఘనంగా ప్రారంభించారు. ఏకలవ్య ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఐట్రిపుల్ఇ కంప్యూటర్ సొసైటీ (హైదరాబాద్) ట్రెజరర్ కడియాల రమణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగింఆరు. సా ంకేతిక పరిజ్ఞానం సస్టెయినబుల్ డెవలప్‌మెంట్‌లో ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తుందో వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఒడిలు, అధ్యాపకులు,స్కాలర్లు, పరిశ్రమ నిపుణులు సా ంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిపై చర్చించారు. ఈ తరహా సదస్సులతో వినూత్న పరిశోధనలకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్ రాజ్,సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ కోదండరామయ్య, హెచ్ఒడి లోకేష్, ప్రొఫెసర్ అజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## రసాభాసగా మారిన... మండల సర్వసభ్య సమావేశం



పూతలపట్టు, అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండలాన్ని అభివృద్ధి చేయాలని దానికి సంబంధించిన అన్ని శాఖలను సమన్వయం చేసుకొని సర్వసభ్య సమావేశం నిర్వహించి ఏ శాఖలో ఏ లోటుపాట్లు ఉన్నాయో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను గుర్తించి అన్ని శాఖల అధికారుల ముందు చర్చిని అంశంగా చేయవల్సిన ఈ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించి ఏదో సమావేశం నిర్వహించామని భ్రమలో నుంచి అధికారులు సంతకాలు సేకరించి సమావేశం పూర్తయింది అని చేతులు దులుపుకునే క్రమంలో పూతలపట్టు ఎంపీడీవో అధికారి వ్యవహార శైలి కళ్ళకు కట్టినట్టు కనిపించింది. నిర్ణీత సమయంలో మండలంలోని సర్పంచులకు ఎంపీటీసీలకు, ఇతర ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఈ సమావేశానికి ఆయా శాఖల నుంచి అధికారులు హాజరుకావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. పూతల పట్టు ఎంపీడీవో వ్యవహార శైలి మార్చుకుని సమావేశానికి 10 రోజులు మునిపే అన్ని శాఖల అధికారులకు మరియు ప్రజా ప్రతినిధులకు ముందస్తుగా సమావేశం ఎప్పుడు ఎంత సమయానికి ఏఏ అజెండాలపై నిర్వహిస్తున్నారు. ముందస్తుగా తెలియపరచిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమేష్ బాబు, ఈవోపిఆర్‌డి శ్రీనివాసులు, జడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి, ఎంపీడీవో నాగరాజు, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎం సింగన్న పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, అక్టోబర్ 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవ్రతంను ఆచరించడం వల్ల భక్తులకు ఈతిబాధలు, కష్టాలు తొలగి అనుకున్న కోరికలు నెరవేరి అంతా శుభం కలుగుతుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయని వేదపండితులు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పెంచల కిషోర్, చైర్మన్ మణినాయుడు, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజి నాయుడు, చిట్టిబాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.